# ఆశాజీవులు

పగిలిన పేవ్‌మెంటును చెప్పుల జోడు మడమతో సహా పరామర్శించడం సుబ్బారావుకి అలవాటు; అంటే అతని అలవాట్లలో ఒకటి. ముఖ్యమైనదికూడా. పెసరట్టులోకి కారం చెట్నీలాంటి అలవాట్లకన్నా ప్రధానమైనది, ఎందుకంటే పెసరట్టు దొరకని రోజు ఉండొచ్చు. పేవ్‌మెంటు పగులుని పరామర్శించని రోజు ఉండదు సుబ్బారావుకి.

అవతల సైకిల్ స్టాండు దగ్గర ఆరంభమై పేవ్‌మెంటు చివరదాకా పాకింది పగులు. ఒకచోట పగులు చీలిపోయి పాయ అయింది. ఆ మధ్య రెండు నల్ల కంకరరాళ్ళు సిమెంటుతో చుట్టరికం తెగతెంపులు చేసుకొని బయట పడ్డాయి. అంటే అక్కడ ఉన్నాయిగాని, తామరాకులో నీటిబిందువుల్లాగ, సర్వసంగ పరిత్యాగుల ఆత్మల్లాగ; అక్కడే ఉంటూ బంధాలు మాత్రం తెంచుకొని విడిగా ఉన్నాయి. ఆ రెంటిమీద ఆనుతుంది సుబ్బారావు ఎడమ జోడు మడమ, కాలు కిందికీ పైకీ ఒత్తితే రాళ్లు రెండు ఒక చిత్రమైన క్రమంలో పరిధిలో కొంచెంగా దొర్లుతాయి. ఒంటికాలుమీద ఉయ్యాల ఊగుతున్న ట్టుంటుంది సుబ్బారావుకి. ఆ ఊగుతున్నంతసేపూ అతను ఈ లోకానికి రాజు, అతనికి చీకుచింతల్లేవు.

అతనికి కుడివైపున కొంచెం ఎదురుగా నిద్రగన్నేరు చెట్టుమొదలుమీద "ఇందునేశన్" పత్రిక తాలూకు పెద్ద విషయసూచిక అంటించి ఉంటుంది. ఎలాంటి మనశ్చలనం లేకుండా ఆ విషయసూచిక చదువుతాడు సుబ్బారావు. కనుకులు, ముంగన్న, విశ్వపతి, – ఆ కూటమంతా చేరుతారు ఎనిమిదిన్నర అయేసరికి అందరు చదువుతారు ఆ విషయసూచిక. ఆ తరువాత పెసరట్లు అంటే వాటిని గురించిన ఆలోచన అవి సంపాదించే మార్గాల అన్వేషణ. రోజూ ఎవరో ఒకరు దొరుకుతారు; ఒకదాత, అయితే దాతల్ని పట్టడంలో సుబ్బారావుకున్న ప్రతిభ, మిగతా మిత్రులకి లేదు. రోజూ కొత్త దాతల్ని పట్టగలడు. ఆ దాతకు ఆ కూటమంతా ఆ పూటకు అతిథులై పోతుంటారు. అలవాటయిన దాతలకి సుబ్బారావు కబుర్లు చాలా భాగం కల్పితాలని అర్థమైనా – ఎబ్బెట్టుగా మాత్రం ఉండవు.

కూటం మెల్లని ఆదుర్దాతో అక్కడ నిలబడి క్రితం రోజు సినీవార్తలు చర్చిస్తోంది. కుమార్ ప్రొడక్షన్సు కలర్ పిక్చర్ అయిపోవచ్చింది. రజని చాలా బాగా చేసింది. నిన్న రాత్రి ఆఖరు కాల్‌షీటు అయిపోయాక రజని కార్లో కుమార్ ఎక్కాడు. రాత్రి మూడైపోయింది. ముందు రజని ఎక్కి డ్రైవర్ని దిగిపొమ్మంది. కుమార్ కారు తోలుకుపోయి పొద్దున్న టి.వి ఎస్‌లో ఇచ్చేసి తన ఇంటికి రమ్మంది. స్టూడియో గేటుదాటి మలుపు తిరిగాక – ఆ గుడిసెలున్న సందులేదూ – అక్కడ చటుక్కున ఎక్కేశాడు కుమార్. ఈ కథంతా ముంగి చెప్పాడు. వాడా కంపెనీకి ఎక్స్‌ట్రా సప్లయర్ అయితే పిక్చరు పూర్తి

కావచ్చిన సందర్భంలో ఎక్స్ట్రాలకి ఇవ్వడానికి డబ్బులేదు. అసలు నిన్నరాత్రి కాల్‌షీట్‌కి హీరోకివ్వడానికే లేదు. ఇంక ఎక్స్ట్రాలకివ్వడాని కేముంటుంది. పాపం రజని హారం తాకట్టుపెట్టి సర్దింది. ఇంతకీ సారాంశం ముంగికి దమ్మిడీ చేతులో పడలేదు. వాళ్ళ వెనక నారాయణ కేఫ్ తెరిచుంది. వాళ్లకోసం "ఒక్కడూ కనిపించడేంరా" అన్నాడు కనుకులు చిరాగ్గా, ఇంకోవేపునించి పుల్లన్నొచ్చాడు. వాడిమొహం చూస్తే తెలిసిపోయింది. ఏమీ లాభం లేదని.

"ఏం రా దేవదాసులో నాగేశ్వర్రావులా పెట్టావు మొఖం?" అన్నాడు సుబ్బారావు.

"పొమ్మన్నాడు," అన్నాడు పుల్లన్న.

"ఏం"? కుమార్ పుల్లన్నని పొమ్మనడం అందరికీ ఆశ్చర్యం వేసింది. పుల్లన్న కుమార్‌కి ఎంతో చేశాడు. అవసరమయినప్పుడల్లా ద్రావకం, తక్కిన హంగులు, అన్నీ అతనే ఏర్పాటు చేసేవాడు, అసలు రజనీకి ఈ కుమార్‌కీ కలిపిందివాడే.

"ఏమయిందిరా"? అని అడిగాడు సుబ్బారావు. "ఏముంది? అమ్మ గారొచ్చింది ఆఫీసుకి. తెల్లరకట్ట నాలుగంటలకి, నేనీదరుగుమీద నిద్దరోతున్నాను. ఉక్కబోత్తందని, అమ్మగారొత్తారని కలగన్నానంట్రా సుబ్బులూ, నిజమేమరి, ఈ తలుపు బైటూరికే గొళ్లెం పెట్టబట్టి అమ్మగారు తలుపు తీసుకు లోపలకెళ్ళిందనుకో, మరయితే అది నా తప్పాంట."

"గది తలుపు ఆళ్లేసూకోలేదామరి?" అన్నాడు విస్సి ఆ అలవాటు ఎపుడూ నేదనుకో. నువ్వెరగవట్రా సిగ్గూసెరం లేదా రజనీకి. సెట్టుమీదే చీర మార్చుకుంటుంది. ఆ మటని అమ్మగారొచ్చి లైటేసింది. ఉయ్యాల బల్లమీద ఒళ్లు మరిసి తొంగున్నారిద్దరూ. లేపింది, కళ్లు నులుపుకుంటూ లేశారు. కళ్ళప్పగానే కారంగుండ కొట్టేసింది? ఇద్దరికళ్ళల్లోనూ ఒకటే గోలనుకో నేనెల్లి సెప్పొచ్చానంట, అమ్మగారితో - అయ్యంటాడు!"

"కుమారూ రజనీ పోంగానే స్టూడియోకొచ్చెంద్రట్రా అమ్మోరు, రజని డ్రైవరు చెప్పాడు." అన్నాడు ముంగి.

"ఒరే, నేను తమ్ముడితో చిలక్కి చెప్పినట్టు చెప్పాను." అన్నాడు సుబ్బారావు. 'చూడు కుమార్! నీ పెళ్లాంకి ఏదో సెటిల్ చేసెయ్యి. నే మాట్లాడతా, ఆ తరువాత లక్షణంగా రజనీ నువ్వు పెళ్ళిచేసుకోండి' అన్నాడు. డబ్బులేదురా అన్నయ్యా, ఈ పిక్చరు పూర్తికానీ అన్నాడు.

పాండీ బజార్ పేవ్‌మెంటుమీదున్న సుబ్బారావు, ప్రొడ్యూసర్ కుమార్‌కి, ఇంత చనువుగా సలహాలివ్వడం ఇతర ప్రపంచకంలో, అసంభవంగా కనిపించినా, సినిమా లోకంలో అదంత అసందర్భంగా కనిపించదు. ఒకవేళ సుబ్బారావు అన్నది నిజమయినా కావచ్చు.

సరే పుల్లన్న ఒక కొత్త సభ్యుడయ్యాడు కూటంలో. నిన్నటిదాకా దాతల స్థితిలో ఉన్నవాడు. అయితే కూటంలో అందరి చరిత్ర ఒకరకంగా ఇల్లాంటిదే. సుబ్బారావుది మాత్రం?

పది పన్నెండేళ్ళ కిందటిమారు కుమారి అపుడు కుర్రగుంట - సుబ్బారావు అంచనా ప్రకారం అంటే ఆమె కప్పుటికింకా ముప్పయి నిండలేదు. మంచి ఉచ్ఛస్థితిలో

ఉంది. మిరపకాయ బజ్జీలంటే మహాఇష్టం కుమారికి. స్టూడియోకి పోయేటప్పుడు జెమినీ స్టూడియో వెనక కోడంబాకం రోడ్డులోకి వెళ్ళగానే కారాపేది. డ్రైవరువెళ్ళి పక్కనున్న చెన్నదుకాణంలోంచి మిరపకాయల బజ్జీలకోసం పోయాక సుబ్బారావు పళ్లెం పట్టుకొని కారు దగ్గరకొచ్చాడు?.

'ఏం కావాలి?' అంది కుమారి. సుబ్బారావు కళ్ళల్లోకి అతిసునాయాసంగా నీళ్లొచ్చాయి.

"అమ్మా! నా పెళ్లాం... ముగ్గురు పిల్లల తల్లి... ఆస్పత్రిలో నిన్నరాత్రి..." అని ఇంక పూర్తి చెయ్యలేకపోయాడు.

డ్రైవర్ తెచ్చిన మిరపకాయబజ్జీల్లో ఒకదాన్ని ఆప్యాయంగా కొరికింది కుమారి తన గోడు ఆమె చెవికి ఎక్కడంలేదేమోనన్న అనుమానం కలిగింది సుబ్బారావుకి. తన ప్రయత్నం ద్విగుణీకృతం చేశాడు.

"ఆకసాయోళ్లు శవాన్ని బయటికీడ్చిపారేశారు తల్లీ" ముగ్గురు పిల్లలూ తల్లిశవంమీద పడి గుండె పగిలిపోయేలాగేడుస్తున్నారు.

నారాయణమూర్తి, ఇట్టాంటి పాడుబతుకెందుకు రాశావురా నా నెత్తిని తండ్రీ!'

కుమారి ఒక మిరపకాయ బజ్జి గిరవాటేసింది పళ్లెంలోకి, సుబ్బారావుకి చిరాకు పుట్టుకొచ్చింది.

"యాలాకోలంగావుందా తల్లీ?"

'అది కొరుకు, కళ్లమ్మట నీళ్ళు ఇంకా బాగా వొస్తాయి'

'నేను చెప్పినదంతా అబద్ధమనుకుంటున్నావా?'

'కాకపోతే కార్లో ఎక్కు. నీ పెళ్లాం శవం ఎక్కడుందో అక్కడకు పోదాం ఊ."

సుబ్బారావు అసహ్యంగా చూశాడు ఆమెవంక. అన్నాడు.

"ఏసీ అణాడబ్బులికి రుజువుకావాలితల్లికి. అమ్మోవ్! నిజంగా నువ్వేత్తావని నమ్మకముంటే, మూడుశవాల్ని, ముప్ఫయిమంది బిడ్డల్నీ పుట్టించగలనుతల్లీ! అడుక్కునీ వోడికి అణాడబ్బులేసి పొమ్మనక, ఈ ఆరాలెందుకు తల్లీ!"

సుబ్బారావు కోపంగా వెనక్కి తిరిగాడు వెళ్ళిపోవడానికి.

'ఆగు' అంది కుమారి. 'కార్లో ఎక్కు.' ఎందుకు? అన్నాడు సుబ్బారావు అనుమానంగా.

'నీకు డబ్బు కావాలి నాకు మనిషి కావాలి' అంది కుమారి. అనేసి తాపీగా వెనక్కి జార్లబడి వగర్చుతూ మిరపకాయబజ్జీలు తినడం మొదలుపెట్టింది. సుబ్బారావు కొంచెంసేపు ఇంట్లోనే ఉన్నాడు - రోజులాగ, కుమారి మహాదర్జా అయిన మనిషి. అయితే వయసు మళ్లిన కొద్దీ పిచ్చిదయిపోయింది. ఆ మార్వాడి కుర్రాడితో పెట్టుకోవద్దు. నిన్నార్పేస్తాడని ఎన్నోవిధాల చెప్పి చూశాడు. కుమారి పొమ్మంది. అయినా కుమారంటే సుబ్బారావుకి మహా అనుమానం

"ఈయాల మనకి దుప్పేనా?" అన్నాడు ముంగి.

'కొంచెం తమాయించరా' ఎవరూ దొరక్కపోతే...

అదుగో మన బావగారేవొచ్చారు. బావగారుండగా మనకేం లోటురా

చారి కారులోంచి తన విశాల కాయాన్ని ఇవతలకి లాగాడు. అతికష్టంమీద.

'ఇదుగో మన క్లబ్బంతా ఇంకా బయటే ఉన్నారేం?'

'లోపలికిపోదామని ఎగబడుతుంటే, ఉండ్రా మనబావగారొత్తారు, మనం ఇక్కడ లేకపోతే చిన్నపుచ్చుకుంటారు, అన్నాను, రండి రండి. హిందూ పత్రిక పత్రారా ముంగీ. ఇందునేశన్... ... కూడా'... అంటూ లాగాడు సుబ్బారావు.

'వొద్దులే, నువ్వు చెప్పేకథలకన్నా ఏం బావుంటాయిరా అందులోవి' అన్నాడు చారి.

"బావగారూ! నేనా ఎడిటర్‌తో అన్నానండి ఒరే, ఇది మర్యాద కాదురా, ఆక్టర్లంతా కళాకారులు ఆళ్ల మనసులన్నీ ఏడెక్కిపోయుంటాయి ఎప్పుడూ టెంచ్చన్‌లో ఉంటాయి. ఆయేడి దించేసుకోకపోతే సచ్చిపోతా్రా. అదీగాక ఆళ్లఆర్టులో, ఆళ్ళ నటనలో, లోపాలుంటే తవ్విపారెయ్యి. ఆళ్ళ రహస్యాలు బయటపెట్టి ఆళ్లని అల్లరిపెడితే నీకేమొచ్చిందిరా అన్నాడు. మరి నేనెట్టాబతికేది అన్నాడండి. అంతే నేనింకేమనలేక పోయాను. అంతేగదండి మరి. ఆడెట్టా బతికేది.'

చారి హిందూ తిరగేస్తూ అన్నాడు. అంతేనే – మరి నువ్విట్టా బతికేదీ.

'బావగారుండగా నాకేం లోటండి. ఒరే పుల్లన్నా బావగారి సంగతి నువ్వెరగవుగాని, మహా భారీ మనిషిలే. బావగారూ, శంకర విజయం – పిక్చరులో మీ యాక్టింగ్ చూశానండి. ప్రమాదం అరవ ప్రమాదంలెండి"

'పెసరట్టేనా?'

'అయ్య?' అన్నాడు సుబ్బారావు అర్థం కానట్టు.

"పెసరట్లకేనా ఈ ఉపోద్ఘాతమంతా?" అన్నాడు చారి.

'మీ దయ'

"సరే పోయి తినండి. బిల్లు నేనిస్తానని చెప్పు."

"పుల్లన్నా! ఆరు పెసరట్లు, కారాచట్నీ ఆర్డరివ్వరా. బావగారితో ఒక్కమాట చెప్పేసివొస్తా" అన్నాడు సుబ్బారావు.

కూటమంతా లోపలికి పోయాక సుబ్బారావు మెల్లగా అన్నాడు.

"బావగారూ! కుమారిని బొత్తిగా మరిచిపోయారు."

"ముసలాడ్ని, నేను దాన్ని మర్చిపోవటమేట్రా, అదే నన్ను మరిచిపోయింది."

"అదేమన్నా పడుచుదా? నలభై అయిదు దాటాయి. ఆ మార్వాడి పీనుగు ఉన్నదంతా ఊడ్చుకుపోతున్నాడు." నిట్టూర్చాడు సుబ్బారావు.

"నీమాటే వినకపోతే ఎవరిమాట వింటుందిరా అది?"

"రైటే, ఏదో ఇలాంటప్పుడు కొత్త దిగు లేసుకొత్తాది. పాతరోజులు గుర్తుకొచ్చినపుడు."

"పెసరట్లు తినరా, అనవసరంగా మనసు పాడుచేసుకోకు."

"నాకా మనస్సు పాడవడం? నాకేం బావగారూ, కానీ రాని పాండీ మహారాజుని ఈ పేమెంటు ఉన్నంతకాలం మనకేం లోటులేదు."

అల్లాంటిచారి పోయాడు. హఠాత్తుగా స్టూడియోలో. గుండెజబ్బన్నారు. దహనం చేసేటపుడు పెద్దలంతా మాట్లాడేరు. కుమారి వచ్చింది. వెక్కివెక్కి ఏడ్చింది వెర్రిపిల్ల. "ఆ కన్నీళ్లు నిజమైనవే అనుకుంటా" అనుకున్నాడు సుబ్బారావు. కుమారితో వచ్చినవాడు మారువాడీకాదు ఇంకోకొత్త మొగం. నాజూకుగా ఆడపిల్లలా ఉన్నాడు. పలుచని పండుతమలపాకులా ఉంది మొగం. అందరూ వెళ్ళిపోయిందాకా ఆగాడు చితిదగ్గర సుబ్బారావు. మెల్లగా కదిలి రోడ్డుమీదకొచ్చేసరికి కుమారికారువుంది. తలుపు తెరుచుకొని ఉప్పెనలావచ్చిపడింది కుమారి....

'అన్నయ్యా? బావగారికలేర్రా అన్నయ్యా!' అంటూ గొంతెత్తి అరవడం మొదలుపెట్టింది. తాగుడుకూడా అలవాటు అయిందన్నమాట. సుబ్బారావు మెల్లగా ఆమెని సముదాయించి కార్లో ఎక్కించాడు; కుమారి అతనిచెయ్యి వొదలలేదు. తనూకార్లో ఎక్కాడు. ఆమెని కార్లో ఎక్కించాడు. కుర్రతను కారుస్టార్టు చేసాడు.

'నీ పేరేమిటితమ్ముడూ!' అన్నాడు సుబ్బారావు.

'కనకారావు'

'ఊరు?'

"నరసాపురం."

అంతే మొదటి పరిచయం. కాస్త బంగారు పిచ్చుకలాగే వున్నాడు అనుకున్నాడు సుబ్బారావు. ఆ సూటే ఉంటుందో రెండుమూడొందలు.

చారిగారులేని పేవ్‌మెంటు చిన్నపోయింది. బరువుగా తాపీగా నడిచొచ్చాడు సుబ్బారావు. దూరంగా నిదరగన్నేరు చెట్టు క్రింద కూటం చేరింది. అయినా తొందరగా పోవాలనిపించలేదు సుబ్బారావుకి.

ఇంతలో పేవ్‌మెంటు పక్కని తెలిసిన కారు నిలబడి ఉంది. కుమారిదని ఆనవాలుకట్టారు. లోపల ఎవరూ లేరు. ఇటూ అటూ చూశాడు. టెర్లిన్ దుస్తుల్లో నవనవలాడుతూ వొస్తున్నాడు రాత్రి చూసిన కుర్రతను. పేరు కనకారావని గుర్తుకొచ్చింది సుబ్బారావుకి.

"ఏం తమ్ముడూ?' హో... హ... హ... చెల్లాయి చెప్పింది నీ సంగతి. పిక్చర్ తీస్తావటగా' ఏదో విసిరాడు. తగలకపోతుందా అని, ఇది వరకు కుమారి చేరదీసిన కుర్రోళ్ళలో చాలామంది పిక్చర్ తియ్యాలని వొచ్చినవాళ్లె. తియ్యడం మాత్రం జరక్కపోయినా–

"అనుకుంటున్నాను." అన్నాడు కుర్రతను, అతను నచ్చాడు సుబ్బారావుకి. పెదవులకొసనించి సిగరెట్టు తియ్యకుండానే సునాయాసంగా మాట్లాడుతున్నాడు. సుబ్బారావు మామూలు ధోరణిలో ప్రారంభించాడు.

'కతముఖ్యం తమ్ముడూ. మంచికత పట్టాలి. మన అస్తపత్రీగాడి దగ్గరేదో, బ్రహ్మాండమయిన కతుందట. ఎందుకు, నే చెపుతాగా. మనం చెప్పిన కతలన్నీ హిట్టే. రాయటమంటె మనకురాదుగాని, కతిని, ఇది హిట్టంటే ఇంక తిరుగులేదు. మరి మన రంగారావుకి నారద సంసారం తియ్యమని చెప్పింది నేనేగా. నేనున్నానుతియ్యి.

అదివందరోజులు పరిగెత్తకపోతే నే చెవి కదపా ఇత్తానన్నాను. నూటయాభై రోజులాడింది... తమ్ముడూ! ఒక ఘోరనా సున్నయ్యా, రొండు సిగరెట్లు... ఈ మధ్య మానేశానుగాని ఎవరన్నా పీలుత్తుంటే, మనసు దాని మీదకిపోద్ది.'

కనకారావు తాపీగా పర్సు తీశాడు. బొత్తాం లాగాడు. పర్సు విప్పుకుంది పెద్దదిపర్సు. కనకరావు చెయ్యింతా అందులోకి పోయింది. ఆశగ చూశాడు సుబ్బారావు. కనకారావు పర్సు తలక్రిందులుగా తిప్పి చెయ్యి తీశాడు. పైని తట్టాడు, కాస్త ధూళన్నా రాలలేదు పర్సులోంచి. సుబ్బారావు కదలి చరచర వెళ్ళిపోయాడు.

కూటమంతా దీర్ఘముఖాలతో నిలబడిఉన్నారు. సుబ్బారావువొచ్చాడు. చారిగారు లేరు. బావగారు ఇంక మళ్ళీ ఇక్కడ కనబడరు. కాలిమడమ పగులు ఉండేచోట అన్ని ఊగడానికి ప్రయత్నించాడు. తన ఊపుకి క్రిందనుంచి సమాధానం లేదు. కిందకి చూశాడు. కార్పొరేషను కూలీలు – తారుపోసి పగులు పూడ్చేశారు. విడిపోయిన రెండు రాళ్లూ తారుపట్టువల్ల పగులుతో బిగుసుకుపోయాయి.

●